


హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ.130	230	260
నల్లగొండ	రూ.158	230	264

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.0

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ వెలుగొందడానికి ప్రధాన కారణం ఓటు హక్కే. అంతటి ప్రాధాన్యం ఉన్న ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అర్హులైన అందరిపై ఉంది. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన వారందరినీ భాగస్వాములను చేసే లక్ష్యంతో ఓటు హక్కు నమోదు గడువును ఎన్నికల కమిషన్ ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించగా, ఇది సోమవారంతో ముగియనుంది. గడువు లోగా ఓటరుగా నమోదైన వారే మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉంటుంది. 18 ఏళ్లు నిండిన వారందరూ త్వరపడితేనే ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకోవచ్చు. - భువనగిరి టౌన్, భువనగిరి అర్బన్


భువనగిరిలో 5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు

మిగిలింది 1 రోజే

ఓటరు నమోదు, సవరణకు నేటితో ముగియనున్న గడువు
ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి అవకాశం

పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ కోసం ఎన్నికల సంఘం విధించిన తుది గడువు నేటితో ముగియనుంది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇటీవలి జాబితాలో దొర్లిన తప్పిదాలను కూడా గడువు లోగా ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకుంటే సవరించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఈ మేరకు అర్హులైన యువత, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని అర్హులందరూ ఎన్నికల కమిషన్ కల్పించిన తుది గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



18న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 18న వెలువడనుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమవుతుంది. మే 13న పోలింగ్ జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది. దీంతో ఈ ఎన్నికల పండుగలో 18 ఏళ్లు నిండిన వారందరూ భాగస్వాములు కావాలంటే తప్పనిసరిగా ఈ నెల 15 లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి.

రెండు నియోజకవర్గాల్లో 35,37,608 మంది ఓటర్లు

ఇటీవలి ఓటరు జాబితా ప్రకారం భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 35,37,608 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో మహిళా ఓటర్లు 17,80,788, పురుష ఓటర్లు 17,56,573,ఇతరులు 247 మంది ఉన్నారు. అయితే రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో కలిపి పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లను చైతన్యం చేసేందుకు జిల్లా యంత్రాంగం స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 90శాతం పైగా ఓటింగ్ శాతం నమోదైంది. దీన్ని వంద శాతానికి పెంచేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రాల్లో 5కే రన్ నిర్వహించారు. అంతేగాక 85ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించారు. స్వీప్‌లో భాగంగా సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల నిబంధనలు అతిక్రమణ కు అందే ఫిర్యాదులను 90నిమిషాల్లో పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే 1950 టోల్ ఫ్రీ నంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

అర్హులందరూ ఓటరుగా చేరాలి

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. నూతన ఓటు నమోదు, సవరణ కోసం ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు నేటి తో ముగియనుంది. సాయంత్రం లోపు బీఎల్‌వోలకు నేరుగా ఫారాలు ఇవ్వాలి. లేదా ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే అవకాశం ఉంది.

- హనుమంతు కె.జెండగే, యాదాద్రి జిల్లా కలెక్టర్

తొలిసారిగా ఓటు వేయనున్నా



జిల్లాలో మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేయనున్నా. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు రూపంలో నా వంతు సహకారం అందించనున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పటికీ ఓటు నమోదు చేసుకొని అర్హులు చివరి రోజు గడువును సద్వినియోగం చేసుకోవాలి.

- మాటూరి అరుణ్, విద్యార్థి, భువనగిరి

ఓటరుగా పేరుందా లేదో తెలుసుకోవచ్చు

ఓటరు జాబితాలు బీఎల్‌వోలు, స్థానిక సంస్థల కార్యాలయాల వద్ద అందుబాటులో ఉన్నాయి. అక్కడికి వెళ్లలేని వారు ఆన్‌లైన్‌లో తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునే అవకాశం ఉంది. గూగుల్‌లో search in electoral roll అని టైప్ చేసి ఎపిక్ కార్డు లేదా పేరు లేదా సెల్ నెంబర్ ద్వారా ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. అలాగే ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అంటే 2006, మార్చి 31లోగా జన్మించిన వారు రానున్న లోకసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు. వీరంతా ఫారం-6తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డును జతపరిచి సంబంధిత బీఎల్‌వోలకు అందించాలి. లేదా ఇంటి నుంచే నేరుగా వెబ్‌సైట్ https//nvsp.in లేదా ceotelan-gana.nic.in ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్లు (08-02-2024 నాటికి)

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
భువనగిరి	1,28,548	1,11,358	1	2,39,907
ఆలేరు	1,16,344	1,17,497	19	2,33,860
మునుగోడు	1,27,547	1,28,513	3	2,56,063
నకిరేకల్	1,25,005	1,27,625	3	2,52,633
తుంగతుర్తి	1,28,240	1,29,752	7	2,57,999
జనగామ	1,18,929	1,22,207	9	2,41,145
ఇబ్రహీంపట్నం	1,69,713	1,67,298	36	3,37,047
మొత్తం	9,14,326	9,04,250	78	18,18,654

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో..

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
దేవరకొండ	1,31,599	1,30,241	18	2,61,858
నాగార్జునసాగర్	1,15,545	1,20,228	21	2,35,795
మిర్యాలగూడ	1,15,352	1,19,956	26	2,35,334
నల్లగొండ	1,20,556	1,27,109	57	2,47,722
సూర్యాపేట	1,18,510	1,24,422	13	2,42,945
హుజూర్‌నగర్	1,21,390	1,28,692	17	2,50,099
కోదాడ	1,19,295	1,25,889	17	2,45,201
మొత్తం	8,42,247	8,76,538	169	17,18,954







నెత్తురోడ్లు

సూర్యాపేట జిల్లాలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నిత్యం నెత్తురోడుతోంది. ఇంటి నుంచి వాహనాల్లో బయటికి వెళ్లిన వ్యక్తులు తిరిగి క్షేమంగా చేరుకుంటారనే నమ్మకం సన్నగిల్లుతోంది. సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలో జాతీయ రహదారిపై ఈ నెల 4వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు ఆరు రోజుల్లో జరిగిన ఐదు ప్రమాదాల్లో 13 మంది మృతి చెందారు. అందులో యువకులతో పాటు ఇద్దరు చిన్నారులూ ప్రాణాలు పొగొట్టుకున్నారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఆర్టీసీ సంస్థల ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది రెండు పర్యాయాలు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల్లో వాహన డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు తగ్గడం లేదు. - సూర్యాపేట క్రైం

సూర్యాపేటలో ఈ నెల 4న లారీని ఆటో వెనక నుంచి ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. సంఘటనా స్థలంలో ముగ్గురు చనిపోగా, చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యం. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయగా, మరొకరు బాధ్యతను మరిచి రోడ్డు పక్కన లారీని నిలపడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వీరి నిర్లక్ష్యానికి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మానసనగర్ వద్ద విజయవాడ వైపునకు వెళ్తున్న లారీని డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో అర్వపల్లి నుంచి సూర్యాపేట పట్టణానికి 16మంది ప్రయాణికులతో వస్తున్న ఆటోడ్రైవర్ లారీని తప్పించే క్రమంలో కుడివైపునకు తిప్పాడు. దీంతో వెనక నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో అది వేగంగా లారీని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో అర్వపల్లి నుంచి వస్తున్నప్పటి నుంచి డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నాడు. ప్రమాద సమయంలోనూ ఫోన్ మాట్లాడుతూనే ఉన్నాడు. ఇదిలా ఉండగా ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కప్పసాటి మహేష్(30) శుక్రవారం మృతి చెందాడు.

యువకులను బలిగొన్న అతివేగం

సూర్యాపేట సమీపంలో ఈనెల 11న ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు, రాత్రి జరిగిన ప్రమాదంలో మరో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే వయసులో అతివేగం, అజాగ్రత్తతో నిండుప్రాణాలను బలితీసుకున్నారు. ఉదయం కేతేపల్లి సమీపంలో ప్రమాదానికి గురైన సమయంలో కారు వేగం 160 కిలోమీటర్లుగా స్పీడోమీటర్‌పై ఉంది. అంత వేగంతో చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా సూర్యాపేట పట్టణంలో 12న జరిగిన ఘటనలో అజాగ్రత్తతో ముగ్గురు మృతి చెందారు. ముగ్గురిలో ఇద్దరు బీటెక్ పూర్తి చేసిన వారు. ఈ రెండు ప్రమాదాలతో పాటు ఈ నెల 5న రాయినిగూడెంలో ఒకరు, 9వ తేదీన పిల్లలమర్రి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి చెందారు.

నిలిచిన హైవే పెట్రోలింగ్

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం గతంలో జీఎంఆర్, పోలీస్ శాఖకు చెందిన వాహనాల్లో సిబ్బంది జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించేవారు. రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టేవారు. అంతేకాకుండా ప్రమాదాలు జరిగితే వెంటనే ఆ వాహనాలను రోడ్డు పక్కకు తీయించేవారు. కానీ ఇటీవల జీఎంఆర్ సంస్థ వాహనాల పెట్రోలింగ్ చేయడం లేదు. అదే విధంగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ఉన్నప్పటికీ వారు రహదారిపై ఎక్కడో ఒక చోట నిలుపుకుంటున్నారే తప్పా పెట్రోలింగ్ చేయడంలేదు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్-65 అధికారులు చర్యలు చేపట్టారు. తరచూ ప్రమాదాలు జరిగే 16 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతానికి జీబ్రా లైన్లు వేయడంతో పాటు, మరికొన్ని చోట్ల ప్రత్యేక లైట్లను ఏర్పాటుచేశారు. ఆయా రోడ్డు క్రాసింగ్‌ల వద్ద సర్వీస్ రోడ్లను నిర్మిస్తున్నారు. అదే విధంగా అండర్‌పాసింగ్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఈ ఏడాదిలో 211 రోడ్డు ప్రమాదాలు

పేట జిల్లా పరిధిలో పలు రహదారులపై ఈ ఏడాదిలో ఇప్పటివరకు 211రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో 95 మంది మృతి చెందగా, 213 మంది గాయపడ్డారు. జిల్లాలో జాతీయ రహదారి కాకుండా మిగిలిన రహదారులను ఇటీవల నూతనంగా నిర్మించారు. వీటిపై కూడా వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ఇటీవల 10 రోజుల వ్యవధిలో సూర్యాపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 15 మందికి వరకు మృతి చెందారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు పోలీసులు ఒకటి రెండు రోజుల పాటు తనిఖీలు చేపట్టి ఆ తర్వాత వదిలేస్తున్నారు. ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు. తర్వాత పట్టించుకోవడం లేదు.



నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు

జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాదిలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపిన 921 మందిపై కేసులు నమోదుచేశారు. అదేవిధంగా అతి వేగంతో వెళ్లిన 41,797 మందిపై, పరిమితికి మించి ప్రయాణిస్తున్న 862 మందిపై, వాహన కాగితాలు లేకుండా ప్రయాణం చేస్తున్న 691 మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 3,815 మందిపై, సీట్ బెల్టు ధరించకుండా వెళ్తున్న 2,369 మందిపై, వాహన నెంబరు ప్లేట్ లేకుండా ప్రయాణం చేస్తున్న 865 మందికి జరిమానాలు విధించారు. అయితే పోలీసులు రోజు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు మాత్రం పట్టణాలు, మండల కేంద్రాల్లో చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ రహదారులపై డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశాలు లేకపోలేదు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. వాహనదారులు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి. డ్రైవర్ల అజాగ్రత్త వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నాం. ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు. యువత వేగ నియంత్రణ పాటించాలి. రోడ్డు ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రజల్లో కూడా మార్పు రావాలి.

- రాహుల్‌హెగ్డే, సూర్యాపేట జిల్లా ఎస్పీ

ప్రమాదాలకు కేంద్రాలుగా...

సూర్యాపేట జిల్లాలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాలు షరా మామూలుగా మారాయి. జాతీయ రహదారి విస్తరణకు ముందు అనేక ప్రమాదాలు జరుగుతుండేవి. అందుకోసం రహదారిని నాలుగు లేన్లుగా నిర్మించారు. అయితే విస్తరణ అనంతరం వాహనాల సంఖ్యతో పాటు వాహనాల వేగం పెరిగి ప్రమాదాలు తగ్గుముఖం పట్టలేదు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా పరిధిలో 65వ నెంబరు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి, ఖాసీంపేట క్రాస్‌రోడ్డు, వల్లభాపురం, గుంజలూరు స్టేజీ, గుంపుల, సూర్యాపేటరూరల్ పరిధిలో టేకుమట్ల, రాయినిగూడెం, పిల్లలమర్రి, సూర్యాపేట పట్టణ పరిధిలో జనగాం క్రాస్‌రోడ్డు, అంజనాపురికాలనీ, వ్యవసాయ మార్కెట్ క్రాస్‌రోడ్డు, రాజీవ్‌పార్కు, ఎఫ్‌సీఐ గోదాం వద్ద, మునగాల మండలంలోని ముకుందాపురం, తాడ్వాయి స్టేజీ, మాదవరం, ఆకుపాముల,కోదాడ పట్టణంతోపాటు మండల పరిధిలోని పలుప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

● అంబేడ్కర్‌కు ఘన నివాళి


గుట్టలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విప్ అయిలయ్య


భువనగిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంత్ కే.జెండగే, అదనపు కలెక్టర్లు, అధికారులు

●8లో..

రైతులు మద్దతు ధర పొందాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 14: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, మద్దతు ధర పొందాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. భువనగిరి, ఆలేరు, కొరటికల్ మార్కెట్ యార్డులను ఆదివారం తనిఖీచేసి రైతులతో మాట్లాడారు. తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకు కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించవద్దని, ధాన్యం విషయంలో రైతులు కంగారు పడొద్దని, ప్రతీ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

ఇప్పటివరకు 323 కేంద్రాల నుంచి 373 మంది రైతుల ద్వారా 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు త్వరగా తరలించాలన్నారు. రవాణా సమస్యలు తలెత్తకుండా సులభతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ధాన్యాన్ని కేంద్రాలకు తరలించిన రైతుల నుంచి ముందస్తుగానే సేకరించి అందుకు కావాల్సిన హమాలీలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆలేరు మార్కెట్ యార్డులో ప్యాడీక్లీనర్లు తక్కువగా ఉన్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్యాడీ క్లీనర్లు అధికంగా ఏర్పాటు చేసి రైతులకు అందించాలని మార్కెటింగ్ అధికారి సబితను ఆదేశించారు. మార్కెట్ పరిధిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.బెన్ షాలోమ్ సూచించారు. కలెక్టర్‌వెంట భువనగిరి ఆర్డీవో అమరేందర్, సివిల్ సప్లయి మేనేజ ర్ గోపిక్రిష్ణ, పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సహకార శాఖ ఇన్‌చార్జి అధికారి పి.ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్లు, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం)లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తాం

ఆత్మకూరు(ఎం): రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. ఆత్మకూరు(ఎం)లో సబ్‌మార్కెట్ యార్డు, కొరటికల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, సివిల్ సప్లయి మేనేజర్ గోపికృష్ణలతో కలిసి ఆదివారం పరిశీలించారు. హమాలీల సంఖ్యను పెంచి రోజుకు నాలుగు లారీల ధాన్యాన్ని ఎగుమతి చేయాలన్నారు. ఆయనవెంట ఏపీఎం పక్కీరయ్య ఉన్నారు.

రైతులు దళారులకు విక్రయించవద్దు

ఆలేరు రూరల్: రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, రెవెన్యూ, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

భువనగిరి రూరల్: నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ జెండగే అన్నారు. భువనగిరి మండలం వీరవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి, ప్రవీణ్ కుమార్, భూక్య దేవ్‌సింగ్, ఏవో పావని ఉన్నారు.

తనిఖీల్లో రూ.9.17కోట్ల పట్టివేత

● నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి


నల్లగొండ టౌన్, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం వరకు తనిఖీల్లో భాగంగా రూ.9.17కోట్ల నగదు, మద్యం, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లావ్యాప్తంగా పటిష్ఠమైన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట నిఘా ఉంచామని, వాడపల్లి, అడవిదేవులపల్లి, టెయిల్‌పాండ్, నాగార్జునసాగర్ వద్ద అంతర్రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటుచేసి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. అలాగే అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులకు అనుబంధంగా అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఎన్‌హెచ్65పై కేతేపల్లి టోల్‌ప్లాజా, చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వట్టిమర్తి వద్ద, మాల్ వద్ద, డిండి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ నెల 14 వరకు జిల్లావ్యాప్తంగా రూ.2.70కోట్ల నగదు, రూ.23.10లక్షల విలువైన మద్యం, రూ.5.13కోట్ల విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

రూ.2.71లక్షల నగదు స్వాధీనం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పోలీసులు ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు వ్యక్తులు తరలిస్తున్న రూ.2.71లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కొండమల్లేపల్లి సీఐ రామ్మూర్తి తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఇస్లావత్ నుంచి రూ.51వేలు, ఉయ్యాల వెంకటేశ్వర్లు నుంచి రూ.1.20లక్షలు, కుంభం శ్రీనివాస్ నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుల్ వెంకటకృష్ణ, రైటర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా కేంద్రం పరిధిలోని ఆర్జాలబావిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు, తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

మళ్లీ మొదలైన ఎండ వేడిమి

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు ● ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాశులను ఆరబెడుతున్న రైతులు ● మండుటెండల్లో శాలిగౌరారం ప్రాజెక్ట్‌లోకి నీరు



మూసీ నది ఫీడర్ ఛానల్ ద్వారా నల్లగొండ జిల్లా శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా చేరుతున్న వరద నీరు

నల్లగొండ, ఏప్రిల్ 14: రెండు రోజులపాటు కాస్త ఉపశమనం కలిగించిన భానుడి ఎండ వేడిమి మళ్లీ మొదలైంది. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటీవల కురిసిన అకాల వర్షానికి నల్లగొండ జిల్లా కేంద్రం పరిధిలోని ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం అత్యధికంగా మాడ్గులపల్లి మండలంలో 42.3, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 37.2 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురంలో అత్యధికంగా 41.1 డిగ్రీలు, తుర్కపల్లి మండలం మన్నెవారి అత్యల్పంగా 37.6డిగ్రీలు, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయిలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా నీరు

శాలిగౌరారం: ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఎండిపోయి సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం ప్రాజెక్టులోకి మూసీ నది ఫీడర్ ఛానల్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మూసీ నది వరద నీరు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చే ఫీడర్ ఛానల్‌ను ఇటీవల ఆయకట్టు రైతులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. ఈ ఫీడర్ ఛానల్ పరిధిలో అనేక చెరువులు, కుంటలు అనుసంధానంగా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ మూసీ నది ఆనకట్ట నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు సుమారు 30 కిలోమీటర్ల వరకు ఈ ఫీడర్ ఛానల్ విస్తరించి ఉంది. దానికి మరమ్మతులు చేయడంతో భారీగా వరద నీరు వస్తుంది. దీంతో అనుసంధానంగా ఉన్న మండలంలోని రామానుజపురం, ఉప్పలంచ, కొంత్తపెల్లి, కందికుంట, గారెకుంటలు పూర్తిగా నిండి ఇప్పటికే అలుగుపోస్తున్నాయి. ప్రస్తుతం మండుటెండల్లో శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా ప్రస్తుతం 2 అడుగులు ఉంది.

ఉద్యాన పంటలకు వేసవి సెగ

● దిగుబడులపై ప్రభావం ● సరైన యాజమాన్యం చేపట్టాలి

మిర్యాలగూడ (వ్యవసాయం), ఏప్రిల్ 14: వాతావరణంలో మార్పులు వ్యవసాయం రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఏర్పడటంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడుతున్నాయి. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఉద్యాన పంటలైన బత్తాయి, మామిడి, నిమ్మ, బొప్పాయి, అరటి, కూరగాయలు వేసవిలో నీటి ఎద్దడితోపాటు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా పంట పెరిగే దశతోపాటు, పూత, పిందె పూర్తిస్థాయిలో రాక పోవడంతో దిగుబడులు పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పంటలను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎలాంటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలో ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి తెలిపారు.

● వేసవిలో పంటలకు నీటి వినియోగం అధికంగా ఉంటుంది. భూమి నుంచి తేమ ఆవిరైపోతుంది. సాయం కాలం నీటి తడులు అందించాలి.



కూరగాయలు, బత్తాయి సాగు

● చెట్ల పాదుల్లో సేంద్రియ ఎరువులైన వర్మీ కంపోస్టు, వరి పొట్టు, గానుగ పిండి, వేరుశనగ, పొట్టును ఉంచితే భూమిలో తేమ ఆవిరికాకుండా ఉంటుంది. పంటకు పోషకాలు అందిస్తే దోహదం చేస్తుంది.

● జీనుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చి రొట్ట, వేప, జిల్లేడు ఆకులను వేసవి ప్రారంభంలో పాదుల్లో వేసి మట్టి కప్పాలి. ఇవి కుళ్లిపోయి భూమిలో సారాన్ని పెంచుతాయి. తేమను పట్టి ఉంచుతుంది.

● మల్చింగ్ విధానం పాటించడం వల్ల నీటి ఆవిరి తగ్గిపోతుంది. పంట పెరిగేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.

● బిందు సేద్యం ద్వారా 30-40 శాతం నీటిని ఆదా చేయవచ్చు.

కేసీఆర్‌ను ఎవ్వరూ టచ్ చేయలేరు

● కాంగ్రెస్ అంటేనే ఫేక్, లీక్ వార్తలు ● ఫోన్ ట్యాపింగ్ కొత్త డ్రామాలు ● మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 14: కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్‌ను ఖతం పట్టించాలని చూస్తున్నాయని, కేసీఆర్‌ను టచ్ కూడా చేయలేరని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ అంటేనే ఫేక్, లీక్ వార్తలని అన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంగా టైంపాస్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనను పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం క్రైం స్టోరీస్ నడుస్తున్నాయని, ప్రజా సమస్యలను బయటకు రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పొలాలు ఎండిపోయినా పట్టింపు లేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికార పార్టీ నిర్లక్ష్యం వహించగా మంత్రులు కేసుల పేరుతో మిల్లర్లను బెదిరించి డబ్బు దండుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఫోన్ ట్యాపింగ్ అంటూ కొత్త డ్రామా మొదలెట్టిందని, ఎవరి ఫోన్లు వినాల్సిన అవసరం ఎవరికి ఉందని ఆయన ప్రశ్నించారు. పనికి మాలిన ప్రయాస పడుతున్న ఆ పార్టీ తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా మళ్లీ వాటర్ ట్యాంకర్లు వస్తున్నాయన్నారు. కేసీఆర్ ఇచ్చిన విధంగా ఈ ప్రభుత్వం కరెంటు ఇవ్వలేకపోతోందని, అనతి కాలంలోనే అభాసుపాలైందన్నారు. నిరుద్యోగ భృతిపై ఉప ముఖ్యమంత్రి, రుణమాఫీపై ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేకపోయారన్నారు. కొత్త ప్రభుత్వం కదా అని సమయం ఇచ్చి చూశామని, ఇక ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నట్లే మాట్లాడుతున్నారు

● అనుచిత వ్యాఖ్యలుచేయడం మానుకోవాలి ● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నట్లే మాట్లాడుతున్నారని, అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆపి ప్రతిపక్ష పాత్ర పోషించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విమర్శించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఈ నెల 13వ తేదీన ఆలేరులో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో స్థాయికి మించిన మాటలు మాట్లాడారని ఖండించారు. ఫాంహౌస్‌లో కేసీఆర్‌కు మందులో సోడా పోసి మంత్రి పదవి తెచ్చుకున్నావని, అలాంటి నీవు సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు మంచి పరిపాలన అందిస్తూ మీరు చేసిన పాపాలను ఒక్కొక్కటిగా కడుగుతున్నారని అన్నారు. ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేల దుస్తులు ఊడతీసినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. లిక్కర్ స్కాం, కాళేశ్వరం దోపిడీ, ఫోన్ ట్యాపింగ్ ఇలా ఒక్కొక్కటిగా బీఆర్ఎస్ హయాంలో చేసిన అవినీతి బయటపడుతున్నాయన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు కానుగు బాలరాజ్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, కౌన్సిలర్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయిలయ్య

కారు షెడ్డుకు కాదు.. పాత ఇనుప సామానుకే

● బీఆర్ఎస్ బీఫాం ఇస్తే ఓటమి భయంతో పారిపోతున్నారు ● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

తిరుమలగిరి, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ కారు పోయింది షెడ్డు కాదని.. పాత ఇనుప సామానుకేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నియోజకవర్గస్థాయి లోకసభ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సామేల్, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఎంపీ అభ్యర్థులకు బీఫాంలు ఇస్తే ఓటమి భయంతో పారిపోతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు కారు షెడ్డుకు పోయిందని, రిపేర్ అయి తిరిగి వస్తుందని కలలు కంటున్నారని, ఆ పార్టీ అడ్రస్ కూడా తెలంగాణలో ఉండదన్నారు. కేసీఆర్ పార్టీని ఎమ్మెల్యే ఎన్నికల్లో బొందపెడ్తాం అన్నాం.. చేసి చూపించాం, రేపు జరగబోయే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి అడ్రస్ లేకుండా చేస్తామన్నారు. కేసీఆర్ అహంకారంతో, నియంతృత్వ పాలన చేసి, ఆయన, ఆయన సైన్యం తెలంగాణలో రూ.వేలకోట్లు దోచుకుందని ఆరోపించారు. అహంతో విర్రవీగిన కేసీఆర్, ఇప్పుడు ప్రజల తీర్పుతో ఫాంహౌస్‌కే పరిమితమయ్యారన్నారు. మంత్రికాకముందు జగదీష్‌రెడ్డి ఆస్తులెన్నో, ఇప్పుడున్న ఆస్తులెన్నో బయటకు తీస్తామన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఏఐసీసీ నేత సర్వోత్తంరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, నరేష్, నర్సయ్య, జ్ఞానసుందర్ పాల్గొన్నారు.

భార్యపై అనుమానం..

● బావిలో దూకి భర్త ఆత్మహత్య

కనగల్, ఏప్రిల్ 14: భార్యపై అనుమానంతో భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఈ ఘటన ఆదివారం జరిగింది. కనగల్ ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జీ.ఎడవల్లి గ్రామానికి చెందిన తలారి వెంకన్న(49) భార్యపై అనుమానంతో కొంతకాలంగా ఆమెతో తరుచూ గొడవపడుతున్నాడు. ఈక్రమంలో నల్లగొండలో ఉంటున్న పెద్ద కుమార్తె ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి 11వ తేదీన వెంకన్న భార్యతో కలిసి వెళ్లాడు. అనంతరం 13వ తేదీన ఉదయం 9గంటల సమయంలో స్వగ్రామం వెళ్తున్నట్లు చెప్పి కుమార్తె ఇంటినుంచి బయల్దేరాడు. అయితే సాయంత్రంవరకు జీ.ఎడవల్లిలోని ఇంటికి చేరలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం చర్లగౌరారం సమీపంలోని ఓ బావిలో మృతదేహమై కన్పించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

గరిడేపల్లి: భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎల్బీనగర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి తిరుమలరావు(42) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చే స్తున్నాడు. భార్యా, భర్తల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా గత ఐదేళ్లుగా భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురై తిరుమలరావు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భువనగిరి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బండసోమారంలో ఓ వ్యక్తి మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శవాల సిద్ధులు తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడగా, ఆయన తండ్రి గుర్తించి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని డ్యూటీ డాక్టర్ తెలిపారు.

గురుకుల పాఠశాల పర్యవేక్షణను మెరుగుపర్చాలి : కుంభం



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 14: భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో పర్యవేక్షణను మెరుగు పర్చాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన ఆదివారం పరామర్శించారు. అనంతరం గురుకుల హాస్టల్‌ను సందర్శించి వసతి గృహంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం తీరును డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శనివారం రోజున ప్రత్యేక వైద్య శిబిరంలో వంద మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని, ఆదివారం మరో 40మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీ కృష్ణ ఎమ్మెల్యేకు వివరించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 11 మంది విద్యార్థులు, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రశాంత్, కృష్ణ అనే విద్యార్థులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రశాంత్ అనే విద్యార్థికి గుండెకు సంబంధించిన అనారోగ్య కారణంగా అతనికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే సూచించారు. అదే విధంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, భువనగిరి ఆర్డీవో పి అమరేందర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. కలుషిత ఆహారం, మంచినీటికి సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ పరామర్శించారు.

అస్వస్థత ఘటనపై విచారణ కమిటీ

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 12, 13వ తేదీల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీ అనంతలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా లైజనింగ్ అధికారి రజిని ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో వసతిగృహాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ ఓఎస్‌డి ప్రశాంతి, విజిలెన్స్ ఆఫీసర్ హుస్సేన్‌తో విచారణ కమిటీని నియమించామని, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి

పాలకవీడు, ఏప్రిల్ 14: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లాపురానికి చెందిన తీగల రమణారెడ్డి(55) వ్యవసాయం చేసుకుంటూ ఓ ప్రైవేట్ పురుగుల మందుల కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గుడుగుంట్లపాలెం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి ఎన్నెస్పీ ఆర్9 కాల్వ కల్వర్ట్‌ను ఢీకొని కాల్వలో పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రమణారెడ్డికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త..

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 14: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయలయ్యాయి. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంతంగి గ్రామానికి చెందిన నందగిరి యాదయ్య (55), భార్య యాదమ్మ(50) దంపతులు ద్విచక్రవాహనంపై గ్రామానికి వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ అతివేగంతో ఢీకొట్టింది. తీవ్ర గాయలకు గురైన ఇరువురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ యాదయ్య మృతి చెందగా భార్య యాదమ్మ చికిత్స పొందుతుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

అడ్డగూడూరు, ఏప్రిల్ 14: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చిన్నపడిశాలలో జరిగింది. గ్రామానికి చెందిన పూజారి యాదయ్య గౌడ్(58) రోజువారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని ముక్తాపూర్‌లో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ముక్తాపూర్‌కు చెందిన ఇటమోని బాలయ్య రోజువారీగా ఆదివారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం



క్యూలైన్లలో భక్తుల రద్దీ

ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 14: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మ దర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడింది. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో కూడా భక్తులు కిక్కిరిసిపోయారు. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా రూ.61,77,746 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

శివాలయంలో వసంతోత్సవాలు

శివాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామివారి వసంతోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామరావు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పాతగుట్ట నృసింహుడి ఆలయం ఎదుట ఉన్న రావి చెట్టుకొమ్మ ఆదివారం రాత్రి వీసిన గాలికి కూలిపోయింది. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి


మోత్కూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


మోటకొండూరులో మాట్లాడుతున్న నాయకులు


రామన్నపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


భూదాన్‌పోచంపల్లిలో...


అంబేడ్కర్ చిత్రపటంతో ఎమ్మెల్యే కుంభం


భువనగిరి పట్టణంలో జై భీమ్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


చౌటుప్పల్ మండలంలో...


ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో...

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్ వర్క్)

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ హనుమంత్ కె. జెండగే అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పి బెన్‌షాలోమ్, గంగాధర్, ఆర్డీవో పి. అమరేందర్, తహసీల్దార్ అంజిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి జినుకల శ్యాంసుందర్ ఉన్నారు. భువనగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ. జహంగీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ జై భీమ్ యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

● యాదగిరిగుట్టలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● అడ్డగూడూరులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మందుల సామేలు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంస్థాన్‌నారాయణపురంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి ప్రేమ్‌చందర్‌రెడ్డి కోరారు. కేక్ కట్ చేశారు.

● వలిగొండలో జరిగిన అంబేడ్కర్ జయంతిలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రామన్నపేటలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ భూస బాలమణి, బాలనర్సయ్య, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్ తదితరులు నివాళులర్పించారు.

● భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నల్ల నాగేష్ పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని భువనగిరిలోనే జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు.

● ఆలేరు మండలంలోని ఆలేరు, కొలనుపాక, శారాజీపేట, గొలనుకొండ, కొల్లూరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మోత్కూరులో ఎమ్మెల్యే మందుల సామేల్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ సంస్థలు, పార్టీల ఆధ్వర్యంలో మోత్కూరులో వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం పంతంగి, దేవలమ్మనాగారం, ధర్మాజిగూడెం, దామెర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● బొమ్మలరామారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరేశం

ఆలేరు రూరల్, ఏప్రిల్ 14: ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. ఆలేరులో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తేనే అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలన్నారు. వంద రోజుల్లోపు ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చెప్పి 120రోజులు గడుస్తున్నా ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. సమావేశంలో నాయకులు రాచకొండ జనార్ధన్ వెంకటేశ్, అడవయ్య, ఉప్పలయ్య, రవి, సలీం, అంజిబాబు, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

ఉషారాణికి ఉగాది పురస్కారం



మోత్కూరు, ఏప్రిల్ 14: మోత్కూరు పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి రేగోటి ఉషారాణికి ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సాహిత్య విభాగం అధ్యక్షుడు చిక్క రామదాసు ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలి కవి సమ్మేళనం నిర్వహించారు. ఉషారాణి వినిపించిన కవితకు ఉగాది పురస్కారం లభించింది. అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, త్రివేణి నుంచి ఆమె పురస్కారం అందుకున్నారు.

బిందుశ్రీ కి మహానంది పురస్కారం



ఆత్మకూరు(ఎం): హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆదివారం నిర్వహించిన తెలుగు వెలుగు ఉగాది జాతీయ మహోత్సవంలో భాగంగా మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన తండ పాండు కుమార్తె తండ బిందుశ్రీకి కూచిపూడి నృత్యకళా రంగంలో మహానంది పురస్కారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోత్కూరు, ఏప్రిల్ 14: మోత్కూరు ప్రభుత్వ జూనియర్ 1987-89 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని నాగోల్‌లో సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన లెక్చరర్లు బాల్‌రెడ్డి, రచ్చ కృష్ణారెడ్డిలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, జె.ధర్మయ్య, బి.హన్మంతు, గనగాని నర్సయ్య, జానకి, రాధ, అరుణ, పోచం సుజాత, మోగానందం, సాయిన శ్రీను, జమాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని మేడిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2007-08 పదో తరగతి పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుమాదవ్‌శర్మ, రాంచంద్రారెడ్డి, శ్రీధర్‌రావు, వహీద్‌అలీ, సత్యనారాయణ, నాందేడ్, నరోత్తమ్‌రెడ్డి, నాగరాజు, యాదగిరి, వెంకటేశం, స్రవంతి, సరోజిని, ప్రవీణ్, నరేష్ ఉన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆలేరు రూరల్, ఏప్రిల్ 14: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కొల్లూరు గ్రామంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74సంవత్సరాలు గడుస్తున్నా దళితుల జీవన విధానంలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రాసిన హక్కులు సైతం అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమలత, అంజనేయులు, శేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారే కాంగ్రెస్‌లోకి రావాలి


ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

మోత్కూరు, ఏప్రిల్ 14: పదవులు, మరేదో ఆశించి వచ్చేవారు అవసరం లేదని, పార్టీ, ప్రజల కోసం పనిచేసే వారే కాంగ్రెస్‌లోకి రావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బీఆర్ ఎస్ మోత్కూరు మునిసిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ లెంకల సుజాతవేణు, కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, ఎంఏ నబి మోత్కూరులో ఎమ్మెల్యే సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఏ పార్టీలో లేని స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉందన్నారు. కొత్త వారు వచ్చినంత మాత్రాన సీనియర్లకు అన్యాయం జరగద న్నారు. అందరినీ సమదృష్టితో చూస్తామన్నారు. కాంగ్రెస్ కార్యక ర్తలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయిస్తామన్నారు. తుంగతుర్తి ప్రాంతవాసి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భువనగిరి ఎంపీ అవుతున్నందున ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తాను మీ బిడ్డనని, మీకు ఏ సమస్య ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి చెప్పుకోవచ్చన్నారు. గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్యగిరి, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు బొల్లెపల్లి సీతయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ. మునీర్, కొండగడప గౌడ సంఘం అధ్యక్షుడు అంబటి నర్సయ్య, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బయ్యని రాజు, బైరు సత్యనారాయణ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, కొప్పుల కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం


తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

వలిగొండ, ఏప్రిల్ 14: మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి గుట్టపైన వెలసిన పార్వతి సమేత పంచముఖ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామికి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తలంబ్రాలను దేవస్థానం ఈవో మోహన్‌బాబు సమర్పించారు. అంతకముందు స్వామివారికి గవ్యాంత పూజలు, రుద్ర హోమం, శ్రీ సూక్తహోమం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు వడ్డెగాని వెంకట్ సోని దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత భూపాల్‌గౌడ్‌పద్మ దంపతులు అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 14: కేంద్రంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యను గెలిపించేందుకు కార్యకర్తలు శ్రమించాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుర్వీరాజుగౌడ్, నాయకులు బచ్చనగొని దేవేందర్, భాస్కర నరసింహ, జక్కలి రాజు, వంగరి రఘు, సూరేపల్లి శివాజీ, దాసోజు వెంకటాచారి, నందగిరి జగత్, జక్కర్తి బిక్షం, బండమీది కిరణ్, కొర్ర శంకర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీరారెడ్డి

పేదల కోసం పోరాడే వారిని గెలిపించాలి


గోకారం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, ఏప్రిల్ 14: పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు తుర్కపల్లి సురేందర్ కోరారు. మండలంలోని గోకారం గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను తొలగించి దాని స్థానంలో మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తోందని ఆరోపి ంచారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శ్రీను, ఈశ్వరయ్య, ముత్యాలు, కనకయ్య, గణేష్, రమేష్, యాదయ్య, పరమేష్ పాల్గొన్నారు.

మూగజీవాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 14: భూదాన్‌పోచంపల్లి మీదుగా అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న గోవులు, పశువులను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆదివారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా డీసీఎంలో హైదరాబాద్‌కు మూగజీవాలను తరలిస్తుండగా మార్గమధ్యలో పిలాయిపల్లి వద్ద కాలువలో వాహనం దిగబడింది. గ్రామస్థులు డీసీఎంను పరిశీలించగా అందులో కొన్నిమూగజీవాలు ఉన్నట్లు గుర్తించారు. అటుగా వెళుతున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 24ఎద్దులు, రెండు ఆవులు, గేదెలున్నాయని గుర్తించారు. పిలాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పడాల సతీష్‌చారితోపాటు గ్రామస్థులు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. అక్కడ పోలీసులకు పట్టుపడిన డ్రైవర్ బానోతు అశోక్, మరోవ్యక్తి అఫ్రపుద్దీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలోని బంజారా సంతలో అజీమ్ అనే వ్యక్తి పశువులను కొనుగోలు చేశాడని, వీటిని హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు చెందిన అష్రఫ్ వద్దకు తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనంలోని మూగజీవాలను హైదరాబాద్‌లోని జియాగూడలోని సమర్థ కామధేను గోశాలకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 14: భువనగిరి శివారులోని రాయిగిరిలో ఆదివారం దుర్గమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ బొడ్రాయి నుంచి దుర్గమ్మ ఆలయం వరకు సామూహిక బోనాలు ఊరేగించి అమ్మవారిని నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, మునిసిపల్ మాజీ చైర్మన్, వైస్‌చైర్మన్లు, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, యువజన సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, గ్రామస్థులు బాల నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఆలేరు రూరల్, ఏప్రిల్ 14: మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలేరులో నిర్వహించిన జార్జిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నూతన విద్యా విధానం కోసం పోరాడిన విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాచకొండ ఉదయ్, తిరుమల్, అక్షయ్, గౌతమ్, ప్రవీణ్, శివమణి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

మోత్కూరు, ఏప్రిల్ 14: స్వాతంత్ర్య సమరయోధుడు, రిటైర్డు ఉపాధ్యాయుడు దివంగత సూరోజు తిరుపతయ్య శత జయంతి సందర్భంగా ఆయన కుమారుడు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, కోడలు రిటైర్డ్ సీడీపీవో యాదమ్మ సహకారంతో రెడ్‌క్రాస్, ప్రజాభారతి, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మోత్కూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ భాస్కరాచారి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మలిపెద్ది రజిత, ప్రజాభారతి అధ్యక్ష, కార్యదర్శులు డి. అరవిందరాయుడు, గుమ్మడి వెంకన్న, యూటీఎఫ్ నాయకులు సుబ్రమణ్యశర్మ, వై.బుగ్గయ్య, డి.సోమేశ్వర్, డి.వెంకన్న, ఆర్.సోమయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 14: చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొడిగే అనంద్‌గౌడ్ నాయకత్వంలో ఆదివారం పలువురు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు. చేరిన వారిలో దేశగోని రమేష్‌యాదవ్, రాచకొండ సురేష్, పల్లం శేఖర్, జిల్లా రమేష్, ఎండీ సలీం, రియాజ్, కందగట్ల వెంకటాద్రి, నంగూర్ యాదయ్య, చీకూరి బుచ్చయ్య, ఉప్పు వీరయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి, ట్రాక్టర్ దగ్ధం

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 14: ఆత్మకూరు(ఎం) మండలంలోని లింగరాజుపల్లిగ్రామం వద్ద గడ్డిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. గ్రామస్థుల వివరాల ప్రకారం భువనగిరికి చెందిన రాసాల వెంకటేష్ ఆదివారం లింగరాజుపల్లిలో తన ట్రాక్టర్‌లో గడ్డి లోడ్ చేసుకొని యాదగిరిగుట్టకు తరలిస్తుండగా, లింగరాజుపల్లి వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు గడ్డికి తగలడంతో మంటలు వ్యాపించి గడ్డితోపాటు ట్రాక్టర్ దగ్ధమైనట్లు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని వంకమామిడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు తనిఖీ చేయగా బొడిగె మహేష్ కిరాణం, ఇంట్లో 48 లీటర్ల మద్యం లభించింది. మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బొడిగె మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఆరుబయట నిద్రిస్తే అంతే..

● రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు ● కలవరపెడుతున్న వరుస సంఘటనలు ● భయాందోళనలో ప్రజలు


వీరవెల్లిలో జరిగిన ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ రవికిరణ్‌రెడ్డి(ఫైల్)

భువనగిరి రూరల్ ఏప్రిల్ 14: భువనగిరి మండలంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. వరుస ఘటనలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. మార్చి నెల 9వ తేదీ నుంచి ఇప్పటివరకు ఆరు చైన్ స్నాచింగ్ కేసులు నమోదు అయ్యాయి. వాటిలో రెండు కేసులను పోలీసులు ఛేదించి నిందితులను రిమాండ్‌కు తరలించారు. తాజాగా మరో నాలుగు ఘటనలు చోటు చేసుకోవడంతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మార్చి 9వ తేదీన మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన చిన్నబత్తిని లూసమ్మ ఆసుపత్రికి వెళ్లేందుకు నడుచుకుంటూ వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. మార్చి 15న మండలంలోని బస్వాపూర్‌కు చెందిన భార్యభర్తలు పులి చంద్రకళ, రామచంద్రయ్య బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి మరో బైక్‌పై వచ్చి చంద్రకళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 29న హన్మపురం గ్రామానికి చెందిన రంగ నీలమ్మ సాయంత్రం ఏడు గంటలకు ఇంటి బయట కూర్చొని ఉండగా ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. ఈ కేసు సైతం పోలీసులు తొమ్మిది గంటల వ్యవధిలో ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మరోసారి ఏప్రిల్ 7న ఆదివారం రాత్రి చీమలకొండూరుకు చెందిన పల్లెర్ల రేణుక దాబాపై కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడును అపహరిచుకుపోయాడు. ఈ నెల 9న మండలంలోని నాగారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏంబావికి చెందిన జక్కా నిర్మల ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు తెరిచి ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలోకి చొరబడి ఆమె బంగారు పుస్తెలతాడును అపహరించుకొని పోయాడు. శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని వీరవెల్లికి చెందిన ఎలకరాజు శ్రీలత అదే గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్ళి వచ్చిన అనంతరం తన ఇంటి ముందు వరండాలో బంధువులతో కలిసి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకొని వెళ్లాడు. సమాచారం అందుకున్న ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐలు సంతోష్‌కుమార్, శివనాగ ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివనాగప్రసాద్ తెలిపారు.

బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించొద్దు

వరుసగా చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రిపూట ఆరుబయట నిద్రిస్తున్న వ్యక్తుల నుంచి బంగారు ఆభరణాలు ఆపహరణకు గురవుతున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించొద్దు. రాత్రి వేళలో ఇంటి తలుపు గడియాలు పెట్టుకోవాలి. గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కన్పించినా, గ్రామ పరిసరాల్లో కొత్త వ్యక్తులు గుడారాలు వేసుకొని నివసిస్తున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తిస్తే సమాచారం ఇవ్వాలి. వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

● రవికిరణ్‌రెడ్డి, రాచకొండ భువనగిరి జోన్ ఏసీపీ.